క్లుప్తంగా

జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ



జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

గుంతకల్లుటౌన్: నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23న అనంతపురం నగరంలోని రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి ప్రతిభా పోటీల్లో స్థానిక ఆర్పీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. వ్యాసరచన పోటీల్లో పవన్ మొదటిస్థానంలో నిలువగా, యశ్వంత్, పవన్ క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన ఈ ముగ్గురు ఈ నెల 25న వైఎస్సార్ జిల్లా కడపలో నిర్వహించే జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం నిర్మల్‌కుమార్ తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎంతోపాటు గైడ్ టీచర్లు ఇమ్మాన్యుయల్, రామ్మోహన్, రాఘవ తదితర ఉపాధ్యాయులు విజేతలైన విద్యార్థులను అభినందించారు.

'ఉయ్యాలవాడ' జయంతి



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని సాయి జూనియర్ కాలేజీలో ఆదివారం తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి గౌరవాధ్యక్షుడు వెంకట రామిరెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి, కోట సంరక్షణ సమితి నాయకులు గోపాల్‌రెడ్డి, రామరంగారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

యాడికి: రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతలకు రూ.వెయ్యి కోట్లను కేటాయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మండల కార్యదర్శి జూటూరు రఫీ ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. చేనేత హోం డ్లూమ్ పార్కులు ఏర్పాటు చేసి, చేనేత ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. చేనేతలకు రూ.24 వేల ఆర్థిక సాయం, చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత్ విద్యుత్ అమలు చేయాలన్నారు. నేతన్నలకు మూడు సెంట్ల స్థలంతో ఇళ్లు, షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో తాడిపత్రి రైతు సంఘం అధ్యక్షుడు ఓబిరెడ్డి, నాయకులు శ్రీరాములు, కళ్లాయి రెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి



మాంసం దుకాణదారులకు సూచనలిస్తున్న కమిషనర్ నయీమ్ అహ్మద్

గుంతకల్లుటౌన్: మాంసం దుకాణాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ విక్రేతలకు సూచించారు. ఆదివారం ఉదయం ఆయన 60 అడుగుల రోడ్డులోని మటన్ దుకాణాలను పరిశీలించారు. పొట్టేళ్లు, మేకలను వధించినప్పుడు వచ్చే వ్యర్థాలను డ్రైనేజీల్లో వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈగలు, దోమలు సోకుండా గ్లాస్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో ఆరాధనోత్సవం



ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చీలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. నశించిన దానిని వెదికి రక్షించుటకు క్రీస్తుఏసు ఈలోకానికి వచ్చారన్నారు. క్రీస్తుకు మహిమకరంగా జీవించినప్పుడే మన జీవితాలు ఫలప్రదమవుతాయన్నారు. కార్యక్రమంలో సంఘసభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?

- రహదారులను కప్పేసిన కంపచెట్లు
- ఇబ్బందుల్లో వాహనదారులు

కంపచెట్లు, ముళ్లపొదలు రహదారులను కప్పేస్తున్నాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అత్యవసరమై రాత్రి పూట ప్రయాణం చేయాలంటే ప్రాణ సంకటంగా మారుతోందని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్లకు ఇరువైపులా కంపచెట్లను తొలగించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



చందన, పచ్చారుమేకలపల్లి రోడ్డును కమ్మేసిన ముళ్ల పొదలు



కుందనకోట సమీపంలో మలుపు వద్ద రోడ్డును కప్పేసిన కంపచెట్లు

యాడికి: రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు, పిచ్చి మొక్కలు కమ్మేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీగా పెరిగిన కంపచెట్ల వల్ల మూల మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలబారిన పడుతున్నారు. మండలంలోని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ విభాగాలకు చెందిన లింక్ రోడ్లు, ఇతర రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు పెరిగాయి. చందన, పచ్చారుమేకలపల్లి మీదుగా యాడికి మండల కేంద్రానికి పోయే రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు పెరిగాయి. చందన గ్రామానికి చెందిన రైతులు, కూలీలు, అలాగే నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం నుంచి రంగాపురం గ్రామాల మీదుగా యాడికి మండలం చందన, పచ్చారుమేకల పల్లి మీదుగా బస్సులు, గ్రానైట్ లారీలు, ఇతర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. పచ్చారుమేకలపల్లి పరిసర ప్రాంతంలోని చెక్‌డ్యామ్, కొండ వద్ద గల మలుపులు తిరిగి ఉంటుంది. కొన్ని చోట్ల రోడ్డు మలుపులను చూపించే సూచిక బోర్డులు సైతం కంపచెట్లలో కలసిపోయాయి. గుడిపాడు, కుందనకోట గ్రామాల వద్ద ముళ్ల చెట్లు ఏపుగా పెరిగాయి. కుందన కోట గ్రామ సమీపంలో నుంచి చింతలాయపల్లికి పోయే రహదారిలో మూల మలుపుల వద్ద చెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు అస్సలు కనబడవు. రాత్రి సమయాల్లో వాహనాల లైట్లు కనబడకపోతే.. వాహనాలు లోయలోకి పడిపోవాల్సిందే. ఏదైనా ప్రమాదం జరిగితే అక్కడ సిగ్నల్స్ లేకపోవడంతో సెల్‌ఫోన్లు కూడా పని చేయవు. పుప్పాల నుంచి వెంగన్నపల్లి మధ్యలో రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు కప్పేయటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను, పిచ్చి మొక్కలను తొలగించాలని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

రాత్రి పూట చాలా ఇబ్బంది



గుడిపాడు గ్రామం నుంచి కుందనకోట గ్రామ సమీపంలో ఉన్న కొండల్లో మలుపులతో కూడిన రోడ్డులో ఏపుగా కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగాయి. మా గ్రామం నంద్యాల జిల్లాకు సమీపంలో ఉండటంతో అధికారులు మా సమస్యలను పట్టించుకోవడం లేదు. మలుపుల వద్ద సూచిక బోర్డులు కూడా లేకపోవడంతో రాత్రి సమయాల్లో ఈ దారిలో ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే.

– వెంకటరాముడు యాదవ్, గుడిపాడు

ముళ్ల పొదలను తొలగించాలి



పెద్దవడుగూరు నుంచి పెద్దపప్పూరు, యాడికి మండలంలోని గ్రామాలకు పోవాలంటే ప్రతి ఒక్కరూ మా ఊరు మీదుగా పోవాల్సిందే. మా గ్రామం నుంచి వెంగన్నపల్లికి పోయే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి రహదారులకు ఇరువైపులా ఉన్న కంపచెట్లు తొలగించాలి.

– దొడ్డి దేవేంద్ర , పుప్పాల

కురుబలు అన్ని రంగాల్లో రాణించాలి



విగ్రహావిష్కరణ చేస్తున్న మంత్రి సవితమ్మ

గుంతకల్లు: కురబలు అన్ని రంగాల్లో రాణించాలని మంత్రి సవితమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని బీరప్పగుడి సర్కిల్‌లో ఏర్పాటు చేసిన భక్త కనకదాస కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రితోపాటు హిందూపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దేవేంద్రప్ప, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ తదితరులు హాజరై ప్రారంభించారు. అనంతరం కురుబ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కురుబల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడుతూ కనకదాసు కీర్తనల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా కీర్తి గడిచారన్నారు. వచ్చే ఏడాది కనకదాస జయంతికి పదో తరగతి, ఇంటర్, ఇతర రంగాల్లో ప్రతిభ కనబరిచిన కురుబ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేయాలన్నారు. ఎమ్మెల్యే జయరాం మాట్లాడుతూ కురుబ, బోయలు సోదర సమానులన్నారు. సీపీఐ నాయకుడు జగదీష్ మాట్లాడుతూ భక్త కనకదాస మార్గంలో కురుబలు నడవాలని పిలుపునిచ్చారు. అంతకముందు స్థానిక రైల్వే గ్రౌండ్ నుంచి బీరప్ప గుడి సర్కిల్ వరకూ నిర్వహించిన కనకదాస చిత్రపటం ఊరేగింపులో ఎంపీ పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు. కురబ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో దాదాపు 70మందికి పైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో కురుబ సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కె.సోమశేఖర్, మల్లికార్జున, కురుబ సాధికార జిల్లా అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, కురుబ సంఘం పెద్దలు పూజారి బసప్ప, పూజారి లింగన్న, కౌన్సిలర్ లింగన్న, నాయకులు లింగన్నగౌడ్, కనకపేటి రామప్ప, పూజారి మందలప్ప, జెడ్పీటీసీ కె.కదిరప్ప, పాల మల్లికార్జున, కె.మహదేవా, కె.శివన్న, సాంబశివ, ఎంఈఓ మల్లికార్జున, యూత్ నాయకుడు పాండు తదితరులు పాల్గొన్నారు. కాగా గుంతకల్లు ప్రభుత్వాస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో కాంపోమెంట్స్ ఏర్పాటు చేయడంతోపాటు ఎంఆర్ఐ, సీటీ స్కాన్ సెంటర్ ఏర్పాటు చేయాలని మంత్రికి జేవీవీ నాయకుడు హరిప్రసాద్ యాదవ్ వినతిపత్రం అందజేశారు.

ఆలయాలను సందర్శించిన జిల్లా జడ్జి



బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాశస్త్యం తెలుసుకుంటున్న జడ్జి ఎం.శ్రీనివాసులు

తాడిపత్రి అర్బన్: తాడిపత్రిలోని ప్రాచీన ఆలయాలైన బుగ్గరామలింగేశ్వరస్వామి, చింతల వెంకటరమణస్వామి ఆలయాలను ఆదివారం ఉమ్మడి అనంత జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.శ్రీనివాసులు కుటుంబ సమేతంగా సందర్శించారు. తొలుత ఆయన స్థానిక బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జికి అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జడ్జి గర్భాలయంలోని మూలవిరాట్ బుగ్గ రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి చింతల వెంకటరమణస్వామి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంజీవనగర్‌లోని వేదగాయత్రీదేవిని దర్శించుకుని, ఐదో రోడ్డులో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఆశీర్వచనం చేసి స్వామి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేసి, జడ్జిని శాలువాతో సత్కరించారు. జిల్లా న్యాయమూర్తి వెంట సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.వెంకట సుబ్బరాయుడు, న్యాయవాదులు హనీఫ్, శివరామకృష్ణ, స్థానిక కోర్టు సిబ్బంది ఉన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు పరిశీలన



గుత్తి: బీఎల్ఓలకు సూచనలిస్తున్న స్పెషలాఫీసర్ వెంకటేశ్వర్లు



పెద్దవడుగూరు: గుత్తి అనంతపురంలో జాబితా పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శిరీష

గుత్తి/పామిడి/పెద్దవడుగూరు: గుత్తి పట్టణంలోని ఎంఎస్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆదివారం అమరావతిలోని సీఈఓ ఆఫీస్ స్పెషలాఫీసర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కొత్త ఓట్లు ఎలా నమోదు చేస్తున్నారో పరిశీలించారు. ఫారం 6, 7, 8 ఎలా భర్తీ చేయించాలో బూత్ లెవెల్ ఆఫీసర్లు, రెవెన్యూ సిబ్బందికి వివరించారు. తహసీల్దార్ ఓబులేసు, మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, వీఆర్వో సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే పామిడి మండలవ్యాప్తంగా 52 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారం ముగిసింది. కార్యక్రమాన్ని తహసీల్దార్ శ్రీధరమూర్తి పర్యవేక్షించారు. అదేవిధంగా పెద్దవడుగూరు మండలంలోని మిడుతూరు, కాశేపల్లి, గుత్తిఅనంతపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తాడిపత్రి నియోజకవర్గ ఈఆర్ఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శిరీష, తహసీల్దార్ ఉషారాణి తనిఖీ చేశారు. ఓటరుజాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా బీఎల్ఓలు సరిచూసుకోవాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ పకడ్బందీగా చేయాలన్నారు.

ఐకమత్యంతోనే నూర్ బాషా కులస్తుల అభివృద్ధి



హాజరైన నూర్ బాషా కులస్తులు



మాట్లాడుతున్న నూర్ బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాజీ

గుత్తి: ఐకమత్యంతోనే దూదేకుల, నూర్ బాషా కులస్తుల అభివృద్ధి సాధ్యమని నూర్ బాషా సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాజీ అన్నారు. గుత్తి పట్టణంలోని నిజామి షాదీ ఖానాలో ఆదివారం దూదేకుల, నూర్ బాషా కులస్తుల ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించారు. బాజీ మాట్లాడుతూ ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. నూర్ బాషా కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, రిటైర్డ్ డీఎస్పీ వన్నూర్‌సాబ్, మాజీ సర్పంచు హుసేన్ పీరా, నూర్ బాషా సంఘం రాష్ట్ర కన్వీనర్ సిద్దయ్య, స్టేట్ కో ఆర్డినేటర్ కాశీం, స్టేట్ యూత్ మెంబర్ ఉమ్మర్ ముక్త యారా, రాష్ట్ర నాయకులు నబి రసూల్, హుస్సేన్, దస్తగిరి, జిల్లా నాయకులు గౌస్ పీరా, ఫజులుల్లా, షరీఫ్, కతాలప్ప మాట్లాడారు. అందరూ ఐక్యంగా ఉండి రాజకీయంగా ఎదగాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఆర్ అండ్ బీ బంగ్లా వద్ద నుంచి నిజామి షాదీ ఖానా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నూర్‌బాషా అబ్దుల్, బాబు, అమీర్, హాజీ వలి, మండల నాయకులు ఖాజా, వరిగడ్డి షాషావలి, దస్తగిరి, కోట బాషా తదితరులు పాల్గొన్నారు. నూర్ బాషా మండల నూతన కమిటీ ఎంపిక: ఆత్మీయ సమ్మేళన సభ సందర్భంగా నూర్ బాషా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా చాంద్ బాషా, ప్రధాన కార్యదర్శిగా కుల్లాయి, ఉపాధ్యక్షులుగా మహబూబ్ బాషా, ప్రింటింగ్ ప్రెస్ బాషా, ఇక్బాల్, సంయుక్త కార్యదర్శులుగా దస్తగిరి, బాబు, షేక్షావలి, కోశాధికారులుగా వరిగడ్డి మాబు, మోదిన్, న్యాయ సలహాదారులుగా ఫక్రుబాషా, నూర్ మహమ్మద్ ఎన్నికయ్యారు.

రేపు కంటి వైద్య శిబిరం

పామిడి: పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు ఆదివారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ శిబిరం నిర్వహిస్తామన్నారుశిబిరానికి వచ్చేవారు ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు రెండు పాస్ ఫోటోలు తెచ్చుకోవాలన్నారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న సీఐ

తాడిపత్రి రూరల్: కరాటేలో మెడల్స్ సాధించిన 20 మంది విద్యార్థులను ఆదివారం అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి అభినందించారు. ఇటీవల మంగళగిరిలో జరిగిన జాతీయస్థాయి టోర్నమెంట్‌లో తాడిపత్రి మండలం గన్నేవారిపల్లి కాలనీకి చెందిన కరాటే మార్షల్ ఆర్ట్స్ కోచ్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రతిభ చాటారు. వారిని సీఐ అభినందించి భవిష్యత్తులో మరిన్ని మెడల్స్ సాధించాలని సూచించారు.

ధర్నా జయప్రదం చేయండి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

తాడిపత్రి అర్బన్: రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యాదర్శి చిరంజీవి యాదవ్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఉమాగౌడ్, రవికుమార్, రమణ, శ్రీరాములు, అబ్రహం, రామకృష్ణ, రాజు, రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి



విలేకరులతో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

పుట్లూరు: మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారంతో లబ్ధి చేకూరదని, ఆ ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాల్సిందేనని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆయన ఎల్లుట్ల గ్రామంలో రోడ్డు ప్రమాద మృతులకు నివాళులర్పించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం ద్వారా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఆటోలకు ట్యాక్స్ మినహాయించి ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. ఎల్లుట్ల మృతుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగంపై స్పష్టత ఇవ్వకపోతే గ్రామస్తులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తానన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శింగనమల: మండలంలోని సోదనపల్లి సమీపంలోని వంకల నుంచి ఓ టీడీపీ నాయకుడు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్‌ను శింగనమల పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఇసుక ట్రాక్టర్‌పై కేసు నమోదు చేశారు. మండలంలో ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

ఘనంగా కార్తీక వన భోజనాలు



గుత్తిలో ఉసిరి చెట్టు కింద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



గుత్తిలో కార్తీక వన భోజనాలు ఆరగిస్తున్న భక్తులు



పెద్దపప్పూరులో నారాయణస్వామిని దర్శించుకున్న భక్తులు

గుత్తి: గుత్తి పట్టణ శివారులోని కర్నూలు రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో ఆదివారం కాశీ విశ్వేశ్వర దేవాలయ అర్చకులు, భక్తుల ఆధ్వర్యంలో కార్తీక వన భోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు రమణాచారి, రమణ స్వామి ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఉసిరి చెట్టు కింద కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం సుమారు 5 వేల మందికి కార్తీక భోజనాలు వడ్డించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో ఉన్న గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం ఆదివారం సందర్భంగా ప్రధాన అర్చకుడు రామాచార్యులు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, అర్చనలు, మహా నైవేద్యం తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



గార్లదిన్నె: అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి




పెద్దపప్పూరు: అశ్వర్థ నారాయణ స్వామి

పెద్దపప్పూరు: కార్తీక మాసం నాలుగో ఆదివారం సందర్భంగా మండలంలోని చిన్న పప్పూరు సమీపంలోని పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వర్థ నారాయణ క్షేత్రానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఈఓ సుబ్రమణ్యం సౌకర్యాలు కల్పించారు. అర్చకులు సుధీర్ కుమార్ శర్మ, బాల సుబ్రమణ్యం శర్మ, సునీల్ కుమార్ శర్మ పూజలు చేశారు.



బుక్కరాయసముద్రం: అలంకరణలో ముసలమ్మ తల్లి



పూజలందుకుంటున్న పెద్దమ్మ తల్లి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట సమీపంలో వెలసిన ముసలమ్మ తల్లి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ముసలమ్మ తల్లి, మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

శింగనమల: మండలంలోని శివపురం గ్రామం పెద్దమ్మ గుడి వద్ద అనంతపురం–తాడిపత్రి 544–డీ రోడ్డుపై ఆటోలు, ద్విచక్రవాహనాలను సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ శరత్ చంద్ర ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేపట్టారు. ఆటోల్లో నిబంధనల మేరకు ముగ్గురు కంటే ఎక్కువ మంది ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ గిరి, కానిస్టేబుల్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్: నిబంధనలకు అతిక్రమిస్తూ ఓవర్ లోడ్‌తో ప్రయాణికులను తీసుకెళుతున్న ఆటోలపై కఠిన చర్యలు తీసుకుంటామని అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని పలు రహదారుల్లో ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భగా ఓవర్ లోడ్‌తో వెళుతున్న ఆటోలు, రికార్డులు సరిగాలేని ఆటోలను సీజ్ చేశారు.